క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ఒంగోలు మెట్రో: ఒంగోలు మంగమూరు డొంక అయ్యప్ప స్వామి క్షేత్రం ఐశ్వర్య నగర్ లో మురళీకృష్ణ మందిరంలో ఉదయం విష్వక్సేన పూజ పుణ్యాహ వాచన ఆదివారం నిర్వహించారు. పుష్పాలంకరణ గావించి సుదర్శన హోమం పూర్ణాహుతి క్రతువులను, వైఖానస ఆగమం నిర్వహించారు. 108 కళశాలతో అభిషేక అత్యంత వైభవంగా నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా జగనన్న పుట్టిన రోజు వేడుకలు



పల్లామల్లిలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

చీమకుర్తి రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పల్లామల్లి గ్రామంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో హ్యాపీ బర్త్ డే జగనన్న అనే నినాదాలతో కేరింతల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నల్లపాటి వెంకటేశ్వర్లు రావులపల్లి వెంకటరావు మండల ఎస్సీ సెల్ కన్వీనర్ గండి రోశయ్య భూతలపల్లి కోటేశ్వరరావు నామినేని కృష్ణయ్య, కృష్ణారెడ్డి, రమేష్ వినయ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష

చీమకుర్తి: యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో పదో తరగతి మోడల్ పరీక్షను నిర్వహించారు. పరీక్షలను రాయడంలో అవగాహన కల్పించటం, మానసిక ఒత్తిడిలను తగ్గించటంలో మోడల్ పరీక్ష దోహదపడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు తెలిపారు. యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శి షేక్ అక్బర్, చలువాది శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: మండల పరిధిలోని గుండ్లపల్లి సమీపంలో లారీ తగిలి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పామూరు మండలం బొట్లగూడూరు గ్రామానికి చెందిన పత్తి బోయిన మనోహర్ (35) విజయవాడ నుంచి బొట్లగూడూరు స్కూటీ పై వెళుతుండగా గుండ్లపల్లి మహి ఫ్యాక్టరీ క్వార్టర్స్ సమీపంలో స్కూటీని లారీ ఓవర్ టేక్ చేస్తూ ఢీకొట్టడంతో స్కూటీ పై ప్రయాణిస్తున్న ఇద్దరు చిన్నారులతోపాటు మనోహర్ పడిపోయాడు. మనోహర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారులు ధాన్యశ్రీ, మేఘశ్రీలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్ అనంతరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు సీజ్ చేసి మద్దిపాడు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

స్మార్ట్ మీటర్లు తొలగించాలి

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని, బిగించిన వాటిని తొలగించాలని, పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచకపోయిన బాదుడే బాదుడే పేరుతో తెలుగు దేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ నేతలు, కూటమి నేతలు నిరసనలు వ్యక్తం చేశారని.. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు గుర్తు చేశారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తదుపరి 17 వేల కోట్ల రూపాయలను విద్యుత్ చార్జీల పేరుతో ప్రజల నెత్తిన పెనుభారం మోపారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో నేటి మంత్రి నారా లోకేష్ బాబు స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఆందోళనలు చేపట్టారని నేడు అదే తంతు కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదానీతో కుదుర్చుకున్న సోలార్ అవినీతి నిజం అయితే వెలికి తీయాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యుత్ ట్రూ అప్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలన్నారు. సీపీఎం నాయకులు అన్ను వెంకట సుబ్బారావు, యు. రామకృష్ణ, దాసరి చినబాబు, టి. సుబ్బారావు, ఏ. కోటేశ్వరరావు, బీవీ రమణరావు, శేషయ్య ఏడుకొండలు, వీరనారాయణ, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

53 మందికి వైద్య పరీక్షలు

మద్దిపాడు: మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. స్థానిక నటరాజ కళా కేంద్రం ఆవరణంలో ఏఆర్సీ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో వైద్య నిపుణురాలు కె. రాధిక పలు సూచనలు ఇచ్చారు. కన్సల్టేషన్ స్కానింగ్, సెమన్ ఎనాలసిస్‌తోపాటు కౌన్సెలింగ్ ఉచితంగా నిర్వహించారు. మొత్తం 53 మంది సంతానం కోసం పలు పరీక్షలు ఉచితంగా చేయించుకున్నారు.

కూటమి పాపం.. ప్రజలకు శాపం

- విపరీతంగా పెరిగిన నిత్యావసరాల రేట్లు
- పెరిగిన బియ్యం, వంటనూనె, కూరగాయల ధరలు
- తిండికి దూరమవుతున్నపేదలు
- బతకలేకపోతున్న మధ్యతరగతి జీవులు
- ధరల నియంత్రణను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



చీమకుర్తి రూరల్:

నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతున్నాయి. సామాన్యులు కిరాణా షాపులకు, కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఒక రోజు ఉన్న ధరలు, మరుసటి రోజు ఉండటం లేదంటే అర్థం చేసుకోవచ్చు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పూట గడవడం కష్టంగా మారింది. సంతనూతలపాడు నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 2 లక్షలకు పైగా జనాభా ఉంది. 60 వేలకు పైగా కుటుంబాలున్నాయి. వీరికి బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు, కోడిగుడ్లతో సహా అన్నీ అందనంత పెరిగాయి.

వంటింట్లో ధరల మంట

వంటింట్లో ప్రతి పూట అత్యవసరమైన బియ్యం ధరలు పెరిగిపోయాయి. సోనా బీపీటీ పాత బియ్యం రూ.5,500 చేరుకుంది. కొత్త బియ్యం రూ.3,500 నుంచి రూ.3,600 వరకు అమ్ముతున్నారు. కందిపప్పు కేజీ రూ.170, మినపప్పు రూ.130, పెసరపప్పు రూ.130కు చేరుకున్నాయి.

ఆకాశాన్నంటున్న కూరగాయలు


కూరగాయల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు, రోజూ వంటల్లో వాడే ఉల్లిపాయలు, టమాటా ధరలు మోత మోగిస్తున్నాయి. మూడు నెలల నుంచి ఉల్లిపాయలు కేజీ రూ.80 పైమాటే. ప్రతి కూరలో వాడే టమోటా రూ.50కి చేరింది. వంకాయలు కేజీ రూ.40, బీరకాయలు రూ.50, క్యారెట్ రూ.80 పలుకుతున్నాయి. బెండ, దొండకాయలు రూ.40 పైమాటే. ఎన్నడూ లేనంతగా దోసకాయలు, అనపకాయలు, పొట్లకాయలు కూడా రూ.30 నుంచి రూ.40 పలుకుతున్నాయి. చిక్కుడు రూ.80కు పెరిగింది. ఆకు కూరలు కట్ట రూ.10 తక్కువ లేదు. అక్టోబర్, డిసెంబర్ మాసంలో వచ్చిన వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గి.. ధరలు పెరిగిపోయాయి.

ధరలపై నియంత్రణేదీ?

అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇంత వరకు గత ధరలను తగ్గించడానికి చర్యలు తీసుకోకపోగా, ఇప్పుడు అధికంగా పెంచినా నియంత్రించలేక ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి ఒక వైపు డబ్బులు వేస్తూ, మార్కెట్లో ధరలు పెంచుతున్నారని ఆరోపించిన కూటమి నేతలు.. తాము అధికారంలోకి వచ్చాక ఎలాంటి పథకమూ అమలు చేయకపోగా నిత్యావసర వస్తువుల ధరలను మాత్రం అమాంతం పెంచేశారని ప్రజలు మండి పడుతున్నారు..

ఎగ్‌బాకుతోంది..

కొండెక్కి కూర్చున్న కోడిగుడ్డు ధర ఆగస్టు నెలలో రూ. 6.20 ఉండగా ప్రస్తుతం రూ.7.50 పెరగడంతో వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. వేసవిలో ఎండ తీవ్రతతో ధరలు తగ్గినా.. ప్రస్తుతం ఉష్ణో గ్రతలు తగ్గి వర్షాలు పడటంతో రోజువారి ఉత్పత్తి క్రమేణా తగ్గుతోంది. దీంతో డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం హోల్ సేల్‌గా గుడ్డు రూ.7.50 ఉండగా, ప్రజలకు మాత్రం రూ.8 నుంచి 9 కు విక్రయిస్తున్నారు. ఇంత ధర గతంలో ఎప్పుడూ నమోదు కాలేదని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు.



గుడ్డు ధర పెరిగింది ఇలా..

2020	5.95 (రూ)
2021	5.20
2022	5.39
2023	6.20
2024	7.50

ఉల్లి ధర చూస్తే ఉలికిపాటు



ఉల్లి ధర రోజురోజుకూ కొండెక్కుతోంది. ఇది జనానికి అందనంత దూరం అవుతోంది. గత ఆరు నెలల నుంచి ఒక్కసారిగా పెరగడం ఆపై కొంచెం తగ్గడం, మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. రెండు నెలలుగా కిలో రూ.50 పలికిన ఉల్లి మళ్లీ వారం రోజులుగా పెరుగుతోంది. ఇప్పుడు మార్కెట్లో లో నాణ్యతను బట్టి రూ.60 నుంచి రూ.70కి చేరుకోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల దుకాణాలకు వెళ్లినప్పుడు ఉల్లి ధర విని వినియోగదారులు ఉలిక్కిపడుతున్నారు. కూరగాయల దుకాణాల్లో అసలే పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతుంటే, నాణ్యత పేరుతో మరింత పెంచి అమ్ముతుండటంతో ప్రజలు కొనేందుకు వెనకంజ వేయాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రధానంగా కర్నూలు, మహారాష్ట్ర రాష్ట్రంలోని షోలాపూర్ నుంచి ఉల్లి దిగుమతి అవుతోంది.

నాణ్యత పేరు చెప్పి..

దుకాణదారులు రెండు క్వాలిటీలు నాణ్యత లేని రకం, పూర్తి నాణ్యత గల రకం పేరుతో ధరలు పెంచి విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ అంచనాలను బట్టి తెలుస్తోంది. మహారాష్ట్రలో అధిక వర్షాలతో ఉల్లి పంట దెబ్బతినడంతో పాటు కర్నూలు జిల్లా పంట నాణ్యత లేకపోవడంతో ఉల్లికి డిమాండ్ ఏర్పడిందని ఉల్లి ధర తగ్గిందనుకుంటే మళ్లీ ఆకాశాన్నంటుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉల్లిని చూస్తే అమ్మో అనేలా దుస్థితి వచ్చింది.. నగటు జీవికి ఉల్లిపాయలను దూరం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీటి ధరలు పెరగకుండా చర్యలు తీసుకోనేది. రాయితీపై ప్రజలకు అందించేది. ఈ ప్రభుత్వంలో ఆ చర్యలు దాదాపు శూన్యమని చెప్పాలి.

కొనేలా లేని వంట నూనెలు

కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో వం టనూనె ధరలు గత రెండు నెల్లోనే కిలోపై రూ.40 దాకా పెరిగింది. వేరుశనగ నూనె కిలో రూ.180, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.150, నువ్వులనూనె రూ.480, కొబ్బరి నూనె లీటరు రూ.360కు చేరుకుంది.

సామాన్యులు బతకలేరు



అన్ని రకాల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజల బతుకు ప్రశ్నార్థకమైంది. కూరగాయల దగ్గర నుంచి ఉప్పు, పప్పు, బియ్యం, చింతపండు ఇలా ఒక్కటేమిటి సామాన్యులకు ఏవీ అందుబాటులో ఉండడంలేదు. దళారీ వ్యవస్థ కారణంగా ధరలు విపరీతంగా పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

-ఏలూరి సురేష్ , ఏలూరి వారి పాలెం

ధరల తగ్గింపు ఎక్కడ?



నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు నోరు మెదపడం లేదు. గత ప్రభుత్వంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆరోపించిన వారు... నేడు అంతకు మించి ధరలు పెరిగినా నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. ఏ ఒక్క సంక్షేమ పథకమూ అమలు కాలేదు. అయినా ఎందుకు ధరలు పెరిగాయి?

– కురాకుల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ, పడమటి నాయుడు పాలెం

ఉత్సాహంగా గణిత దినోత్సవం

సంతనూతలపాడు: గణిత దినోత్సవం పురస్కరించుకొని సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణిత ముగ్గులు, వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. గణిత ఉపాధ్యాయులు వజ్రాల మాధవి లత, కేవీఎస్ఎస్. రజిని, ఎంవీఎస్ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



వెంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

సంతనూతలపాడు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఏడో రోజున ఉభయ దాతగా శిఖాకొల్లి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకన్న,రాజ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజల్లో కూర్చున్నారు. ఈనెల 16వ తేదీన ప్రారంభమైన ధనుర్మాస పూజలు జనవరి 14వ తేదీతో ముగియనున్నాయి. ఆలయ అర్చకులు పరాంకుశం అజయ్ బాబు ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ధనుర్మాస సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థుల కోసం ప్రజ్ఞా వికాస పరీక్షలు



ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: విద్యార్థుల్లో ఫైనల్ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకే ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంఘాలు ప్రజ్ఞా వికాస పరీక్షలను నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి చెప్పారు. ఆదివారం జిల్లాలోని 10 కేంద్రాల్లో ప్రజ్ఞా వికాస పరీక్షలను 9 వేల మందికి రాశారు. నగరంలోని పీవీఆర్ బాలు పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ లక్ష్మీ నారాయణ, సుబ్రమణ్యం, జయప్రకాష్, బండి వీరాస్వామి, దేవ, రాజశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



మైనంపాడు గ్రామంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాల ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హోం మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం సమావేశం హాలులో పీవీ రావు వర్ధంతి సభ నిర్వహించారు. మాల ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి జనార్దన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఉద్యోగుల సంఘ నాయకులు మాట్లాడుతూ మాలల హక్కుల కోసం ఉద్యమించిన నేత పీవీ రావు అని కొనియాడారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతురావు, ప్రధాన కార్యదర్శి గోపినాథ్, కోశాధికారి యరమాల మల్లిఖార్జునరావు, మాల సంఘాల కన్వీనర్ పిల్లి మాల్యాద్రి, ఎంఆఓ నాగేంద్ర వదన్, ఏపీఓ కొండయ్య, బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, రిటైర్డ్ డీఈవో మధు సూదనరావు, జేఏసీ జిల్లా కన్వీనర్ వెంకట్, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై సీపీఎం నిరసన

సంతనూతలపాడు: మైనంపాడు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే అమిత్ షా క్షమాపణ చెప్పాలని మండల కార్యదర్శి కె. పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన హోం మంత్రి అమిత్ షా ఆ పదవికి రాజీనామా చేయాలన్నారు. కె. హనుమంతరావు, ఏ. భగత్ సింగ్ పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి



మాట్లాడుతున్న నాయకులు



చీమకుర్తి: పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

చీమకుర్తి: మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు వర్ధంతి సందర్భంగా ఆదివారం చీమకుర్తిలోని అంబేడ్కర్ నగర్‌లో మాల మహానాడు ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడును స్థాపించి పోరాటం చేసిన సంఘటనలను ఈ గుర్తు చేసుకున్నారు. తొలుత పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేఏసీ కన్వీనర్ బండ్ల డేవిడ్‌తో పాటు సంఘంలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

మాలలు మానవ హక్కుల యోధులు

ఒంగోలు వన్‌టౌన్: మాలలు మానవ హక్కుల యోధులని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పీవీరావు 19వ వర్ధంతి స్థానిక దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ని విమర్శించిన, అవమానించిన అమిత్ షాను ప్రశ్నించనది మాదిగలేనన్నారు. అగ్రవర్ణాల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడేది మాలలేనని గుర్తు చేశారు. చంద్రబాబు, మంద కృష్ణ ఉద్యమం అన్నారు. కారంచేడు మాదిగలపై జరిగిన మరణకాండ నేపథ్యంలో ఆవిర్భవించిన దళిత మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమం దేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తెచ్చిందన్నారు. 1994లో బహుజన సమాజ్ పార్టీ ఏపీలోకి అడుగుపెట్టడంతో చంద్రబాబు నాయుడు, మంద కృష్ణమాదిగ కుట్రలో నుంచి పుట్టిందే ఎస్సీ వర్గీకరణ సిద్ధాంతమన్నారు. పీవీ రావు ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టుకు వెళ్లి రద్దు చేయించారన్నారు. మాల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్‌ల పంపిణీ

చీమకుర్తి: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో పేదలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పది మంది పేదలకు రూ.90 వేల విలువ చేసే మిషన్‌లను క్లబ్ వ్యవస్థాపకులు చెరుకూరి రఘుకిరణ్ చేతుల మీదుగా అందించారు. వారి జీవనోపాధికి దోహదపడతాయని రఘుకిరణ్ వారికి భరోసా ఇచ్చారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి కడవా రామకృష్ణ, కేవీ సుధాకర్, స్థానికులు పాల్గొన్నారు.

మెరైన్ పోలీస్ స్టేషన్ తనిఖీ

కొత్తపట్నం: స్థానిక మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం కోస్టల్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ ఎస్పీ మధుసూదన్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ చుట్టూ, రికార్డులను పరిశీలించారు. పోలీష్ స్టేషన్ చుట్టూ రాళ్లు ఏర్పాటు చేసి, మొక్కలు వేసి ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ల్యాండ్ పాయింట్లు దగ్గర జాగ్రత్తలు పాటించాలన్నారు. సముద్రంలో నుంచి వచ్చే ప్రతి బోటు తనిఖీ చేయాలని ఆదేశించారు. అనుమానితులు ఎవరైన ఉంటే వారిని వెంటనే అదుపులో తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారులతో సంబంధాలు పెట్టుకోవాలని ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలని సూచించారు. తీరం వెంబడి పూర్తి సమాచారం దగ్గర ఉండాలన్నారు. సముద్రంలో వేటకు వెళ్లే బోట్లపై కూడా నిఘా పెట్టాలని కోరారు. మెరైన్ సీఐ ఎస్.సాంబశివరావు, ఎస్సై పి.సుబ్బారావు, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.



మెరైన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ మధుసూదన్‌రావు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీక్రిస్మస్ వేడుకల్లో ఎస్పీ దామోదర్



సెమీ క్రిస్మస్ వేడుల్లో పేస్‌ఎన్‌ఆర్ స్కూల్ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: లోక రక్షకుడు యేసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని షేక్ రియాజ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నగరంలోని పేస్ ఎన్ఆర్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడారు. డాక్టర్ జాలాది మణిబాబు వాక్య పరిచర్య చేశారు. కార్పొరేటర్ మలగా రమేష్, శ్రీపతి సతీష్, డాక్టర్ జీవన్, విద్యుత్ శాఖ అధికారి సుధీర్ బాబు, మక్కెన థామస్, సినీ డైరెక్టర్ సురేష్ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. వేసుపాగు కోటయ్య, ఒంగోలు వసంతకుమార్, బుజ్జి, అనిల్ వేడుకలను పర్యవేక్షించారు. అంగలకుర్తి ప్రసాద్ సతీమణికి సంఘ పక్షాన అతిథుల చేతుల మీదుగా చీరలు ప్రదానం చేశారు. అనంతరం ప్రేమ విందులో పాల్గొన్నారు.

క్రీస్తు జననం.. ప్రపంచ శాంతి సందేశం

ఒంగోలు టౌన్: ప్రభువు ఏసు క్రీస్తు జననం ప్రపంచ శాంతికి శాంతి సందేశమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కమ్యూనిటీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి క్యాండిల్ లైటింగ్ సర్వీస్ నిర్వహించారు. డ్రాయింగ్ గ్రీటింగ్ కార్డులు, నాటకం ప్రదర్శించిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్ కుమార్, ఆర్ఐలు సీతారామి రెడ్డి, రమేష్ కృష్ణన్, పాస్టర్ ప్రసాద్, పోలీస్ కమిటీ చర్చి సభ్యులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు తరలిరావాలి



హిందూ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఒంగోలు మెట్రో: దేవాదాయ ధర్మాదాయ శాఖ పేరిట ప్రభుత్వం హిందూ దేవాలయాలపై చేస్తున్న పెత్తనాన్ని రద్దు చేయాలని, హిందూ దేవాలయాల్లో అన్య మతస్తులను తొలగించాలని వక్తలు డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి ఐదో తేదీ లక్షలాది మంది హిందువులతో హైందవ శంఖారావం పేరిట భారీ బహిరంగ సభ విజయవాడలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాషాయ పతాకాలను చేపట్టి జైశ్రీరామ్ నినాదాలతో సీతారాంపురం బస్తీలో ర్యాలీ నిర్వహించి ప్రతి ఇంటికి కరపత్రాలను అందించారు. రాధా రమణ గుప్త జంధ్యం, సింగోతు ఏడుకొండలు ఈమేరకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెలిపారు. భార్గవ దుర్గాప్రసాద్, మెండాల సుబ్బారావు, రెడ్డి మల్లికార్జున్ రావు, మేండాల సాయిరాం, గండికోట సుశాంత్, దండూరి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

నాగులుప్పలపాడు: భవననిర్మాణ వెల్ఫేర్ బోర్డును పునద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అన్నారు. ఆదివారం ఉప్పుగుండూరులో మండల సమావేశంలో మాట్లాడారు. 1996లో కేంద్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసిందని, రాష్ట్రంలో పాలకులైన టీడీపీ వెల్ఫేర్ బోర్డు నిధులు రూ. 1600 కోట్లు పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు వినియోగించి బోర్డును నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భవణ నిర్మాణాలపై వసూలు చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాలన్నారు. స్కీం కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఎస్. రామారావు, జి. బసవపున్నయ్య, చిరంజీవి, బాలకృష్ణ, ఏలీషా, వీరయ్య పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



హెల్మెట్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్

నాగులుప్పలపాడు: హెల్మెట్ ఒక ప్రాణాన్ని కాపాడటమే కాదు, ఒక కుటుంబాన్ని రోడ్డు మీద పడకుండా చేస్తుందని ఎస్ఐ బి. శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వాహనదారులకు దాని ప్రాముఖ్యత వివరించారు. వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.